క్లుప్తంగా

గుండెపోటుతో వ్యక్తి మృతి

కంది(సంగారెడ్డి): గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కందిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కాశీపూర్‌కు చెందిన శేరి రవి(35) గురువారం మధ్యాహ్నం కంది పరిధిలో ఉన్న వైన్స్ వద్దకు మద్యం తాగేందుకు వెళ్లాడు. మద్యం తీసుకొని పక్కనే ఉన్న పర్మిట్ రూంలోకి వెళ్లి కూర్చున్నాడు. ఈ క్రమంలో కొద్దిసేపటికే అతడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైన్స్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి భార్య శేరి సంగీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో రవి మృతి చెంది ఉండవచ్చని ఎస్ఐ పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షలపై అవగాహన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ప్రముఖ వైద్యులు శివబాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. వంద రోజుల్లో 100 మార్కులు ఎలా సాధించాలి, తెలుగు వ్యాకరణం, గణితం, సాంఘీక, సామాన్య శాస్త్రంలకు సంబంధించి ముఖ్య అంశాలను వివరించారు. పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు గురువారం జహీరాబాద్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, ఎంపీపీ అంజమ్మ, ఉపాధ్యక్షుడు గౌసోద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

నేడు మృత్యుంజయ హోమం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి దొంతి వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ తెలిపారు. కొంతకాలంగా గ్రామ యువకులు చనిపోతుండటంతో వేద పండితుల సూచనల మేరగా గ్రామంలో కొలువైన వేణుగోపాలస్వామి సన్నిధానంలో ఉదయం 11 గంటలకు ఈ హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

రేగోడ్(మెదక్): నారాయణఖేడ్ బహిరంగ సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని అవమానించారని గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు రాథోడ్ నెహ్రూనాయక్ మండిపడ్డారు. గురువారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇప్పుడిప్పుడే బంజార జాతికి గుర్తింపు వస్తున్న తరుణంలో రేవంత్ రెడ్డి తమ జాతిని మళ్లీ అంధకారంలోకి నెట్టేస్తున్నారన్నారు. తక్షణమే ఆయన గిరిజనులను క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేష్ నాయక్ పాల్గొన్నారు.

సబ్బండ వర్గాలకు అండగా ఉంటాం

- గొల్ల, కురుమల అభ్యున్నతికి కృషి
- ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- బీఆర్ఎస్, బీజేపీలను నమ్మొద్దు
- కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్



గొల్ల, కురుమల సమ్మేళనంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: సబ్బండ వర్గాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలో గొల్ల, కురుమల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గొల్ల, కురుమల పిల్లల ఉన్నత చదువులకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. సీఎం కేసీఆర్ గొల్ల, కురమలను పట్టించుకోలేదని, వారికి ఆర్థిక సహాయం చేస్తామని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని వివరించారు. అంతకుముందు చంద్రశేఖర్‌కు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కర్నాటక ఎమ్మెల్యే శివన్న మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల, కురుమలను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటుందన్నారు. కర్నాటక రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలో కూడా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉజ్వల్‌రెడ్డి, ఎంజీ రాములు, కండెం నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్‌లో చేరిక

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఇస్మాయిల్, హుస్సేన్, అరీఫ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, నాయకులు రాంరెడ్డి, వీరారెడ్డి, రవీందర్‌రెడ్డి, విష్ణు, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రచారం



కక్కర్‌వాడలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని కుప్పానగర్, కక్కర్‌వాడ, తుమ్మన్‌పల్లి, ఏడాకులపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీలను వివరించారు. కార్యక్రమంలో కక్కర్‌వాడ సర్పంచ్ మోహన్ రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్‌స్వామి, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బల్కం చెల్క (భక్తిధాం) తండాలో విశ్వపాలిని భవానీ సమేత సేవాలాల్ మహరాజు మహ మందిరం వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మెడ్చల్ జిల్లా రవాణశాఖ అధికారి, మందిరం ధర్మకర్త మూడ్ కిషన్‌సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనాలు ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహరాజు, టీవీ ఆర్టిస్టు సిద్ధాంతి బ్రహ్మశ్రీ చంద్రమౌళిశ్వర శర్మ, మందిరం పురోహితులు మనోజ్‌శర్మ, మాజీ ఎంపీలు హన్మంత్‌రావు, సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సతీమణి జయశ్రీరెడ్డి, కూతురు శ్రేయరెడ్డి, సోదరుడు జైపాల్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని లక్డారం, ముత్తంగి గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీల హామీలను వివరించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలి

- బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి
- ముమ్మరంగా ఇంటింటి ప్రచారం



నర్సాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి, పక్కన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ రూపొందించిన పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించాలని మంత్రి హరీశ్‌రావు సూచించారని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంపై మంత్రి నియోజకవర్గంలోని మండలాలవారీగా సమీక్ష చేపట్టి పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నారని, తమ పార్టీ నర్సాపూర్‌లో గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, సీఎంగా కేసీఆర్ మూడోసారి బాధ్యతలు చేపట్టి హ్యాట్రిక్ సాధిస్తారని మంత్రి చెప్పారని వివరించారు.

నర్సాపూర్: రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు సమక్షంలో పలువురు ఆయా పార్టీల నాయకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. గురువారం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులతో మండలాలవారీగా మంత్రి సమీక్ష చేపట్టారు. సమీక్ష అనంతరం బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ప్రసాద్, నియోజకవర్గం బీజేవైఎం కన్వీనర్ నిఖిల్‌గౌడ్‌తో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కొల్చారం(నర్సాపూర్): బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ మేఘమాల పేర్కొన్నారు. గురువారం



అప్పాజీపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సునీతారెడ్డి కోడళ్లు కృత్తికారెడ్డి, కీర్తిరెడ్డి

నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా ఆమె కోడళ్లు కృత్తికారెడ్డి, కీర్తిరెడ్డి మండలంలోని అప్పాజీపల్లి, పోతంశెట్టిపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్ పేపర్, ఈవీఎంలతో ప్రచారం చేశారు.

బీఆర్ఎస్‌తోనే రైతుల అభివృద్ధి

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం రైతును రాజును చేయడంతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని, ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. గురువారం కౌడిపల్లితోపాటు కంచన్‌పల్లి, పాంపల్లి, సదాశివపల్లి, ధర్మాసాగర్ తదితర గ్రామాలలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాలను ఆదుకుంటున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటువేసి సునీతారెడ్డిని గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ శ్రేణులు గురువారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డిని గెలిపించాలని ఓటర్లకువిజ్ఞప్తి చేశారు.

చెరకు రైతులను విస్మరించొద్దు



మాట్లాడుతున్న రైతు నాయకుడు ఢిల్లీ వసంత్

జహీరాబాద్ టౌన్: ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ చెరకు రైతుల గురించి మాట్లాడకపోవడం బాధాకరమని రైతు నేత ఢిల్లీ వసంత్ అన్నారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిల్లులు అందక, కర్మాగారంలో క్రషింగ్ ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతుంటే వారి గురించి సీఎం మాట్లాడకపోవడం విచారకరమన్నారు. సంగమేశ్వర ఎత్తిపోతల పథకం, నారింజ ప్రాజెక్టు గురించి మాట్లాడి చెరకు రైతుల సమస్య గురించి ప్రస్తావించలేదని వాపోయారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు కూడా సీఎం దృష్టికి రైతుల సమస్యలను తీసుకెళ్లలేదన్నారు. నిమ్జ్ భూముల పరిహారం, ప్రభుత్వ ఐబీటీ గురించి కూడా ప్రస్తావనలేదన్నారు. రైతులకు రావల్సిన చెరకు బిల్లుల బకాయిలపై ఇంతవరకూ స్పష్టతలేదన్నారు. రైతులు, కార్మికులతో సమావేశమై త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో రైతు నాయకులు కొండల్‌రెడ్డి, ఎంజీ రాములు, జగదీష్, రత్నం, అశోక్, విశ్వనాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పునఃప్రారంభం



పనులు చేస్తున్న కూలీలు

జహీరాబాద్ టౌన్: సమస్యలు పరిష్కరించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని బాబానగర్ ప్రజలు హెచ్చరించడంతో ఎట్టకేలకు అధికారులు రోడ్డు పనులను గురువారం పునఃప్రారంభించారు. జహీరాబాద్ మున్సిపల్‌లో విలీనమైన బాబానగర్‌లో గతంలో రోడ్డు పనులను ప్రారంభి వదిలేశారు. ఈ క్రమంలో పనులను పూర్తిచేయాలని, లేనిపక్షంలో అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తామని ఇటీవల కాలనీ ప్రజలు తీర్మానించారు. దీంతో స్పందించిన అధికారులు రోడ్డు పనులను పునప్రారంభించారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

డీఆర్‌డీఓ శ్రీనివాస్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని అంతారం, సామ్లా తండాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం అదనపు డీఆర్‌డీఓ భీమయ్యతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని కొనుగోళ్లు వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా కొనుగోళ్లు పూర్తి కాగానే ట్యాబ్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో డీపీయంలు మోహన్, ప్రకాశ్, ఏపీఓ రమేష్, ఎంటర్‌ప్రైసెస్ ఏపీయం శ్రీనివాస్, మండల ఐకేపీ ఏపీయం ప్రేమలత, ఈసీ భగవాన్, కార్యదర్శి రవిశంకర్, సీసీలు వరలక్ష్మి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు బీఆర్ఎస్ కృషి

- యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం
- బెల్ కార్మికులకు అండగా ఉంటాం
- బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురం: మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల శ్రేయస్సుకు బీఆర్ఎస్ కృషి చేస్తోందని ఆ పార్టీ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి బెల్ కాలనీలోనే ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ప్రధానంగా బీహెచ్‌ఈఎల్ పరిశ్రమ నష్టాలతో సతమతమవుతున్న సమయంలో పరిశ్రమను ఆదుకున్నారని తెలిపారు. సమావేశంలో బెల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు రెహ్మాన్, బెల్ కార్మిక సంఘం సీనియర్ నాయకులు ఎల్లయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలు పేదలకు వరం

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు పేదలకు వరమని బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. గురువారం రాత్రి పటాన్‌చెరు మండలంలోని భానూర్ గ్రామానికి చెందిన బీజేవైఎం పటాన్‌చెరు మండల అధ్యక్షుడు అచ్చిని శివ తన మిత్రులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్, భానూర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశీర్వాద సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాదసభకు పటాన్‌చెరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జై కేసీఆర్.. జై తెలంగాణ అంటూ నినాదాలు చేస్తూ సీఎంకు స్వాగతం పలికారు. పట్టణమంతా ర్యాలీలు, పాదయాత్రలు, కళాకారుల ఆటపాటలతో గులాబీమయమైంది.



బైక్‌ర్యాలీతో ఆశీర్వాదసభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

బీఆర్ఎస్‌తోనే యువత ఉపాధి

మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: బీఆర్ఎస్‌తోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ కార్పొరేటర్ సపనదేవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు విజయభాస్కర్‌రెడ్డితో కలిసి గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణకు మరో రాష్ట్రం సాటిరాదన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు నర్ర భిక్షపతి, బాబుల్‌రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ప్రచారం..

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, దోమడుగు, అన్నారం గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు



గుమ్మడిదలలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు



శ్రీకాంత్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

ఈదులపల్లిలో పులి సంచారం



పంటపొలాల వద్ద వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామ శివారులో పులి సంచరించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. గ్రామ శివారులో పులి సంచరిస్తున్న విషయాన్ని గ్రామస్తులు అధికారులు ఇనియాత్ అలీ, రఘు దృష్టికి తీసుకెళ్లగా పులి అడుగుల ముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రహదారులపై రాకపోకలు సాగించేవారు, పొలాలకు వెళ్లే సమయంలో గుంపులుగా ఉండాలని సూచించారు. పులి సంచరిస్తున్న విషయంతో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు.

బీఎస్పీని గెలిపించండి

పటాన్‌చెరు టౌన్: రాబోయే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి నీలం మధు కోరారు. పట్టణ పరిధిలోని చిట్కుల్ గ్రామం ఎన్‌ఎమ్‌ఆర్ కార్యాలయంలో నీలం మధు ముదిరాజ్ ఆ పార్టీ నాయకులతో కలిసి 10 భరోసా మ్యానిఫెస్టో హామీలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ ఇంటి బిడ్డ మీ ఇంటి గుమ్మంలో పేరుతో నిర్వహించిన పాదయాత్రలో ప్రజల కష్టాలు స్వయంగా చూశానని, దీంతో ప్రజల కోరిక మేరకు ప్రజాభిష్టానికి అనుగుణంగా మేనిఫెస్టో రూపొందించామని తెలిపారు. ఈ మేనిఫెస్టోతో ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, ఉపాధితో పాటు సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, ఎన్‌ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని శ్రీలక్ష్మీ గణపతి, దత్తాత్రేయ, ఆంజనేయ సహిత సాయినాథ ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహవచనము, రక్షాబంధనము, పంచగవ్యప్రాశన, ఋత్విక్వరణము, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. సాయంత్రం గ్రామంలో పల్లకిసేవ చేపట్టారు.